క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి మహా రుద్రాభిషేకం



సుబ్రహ్మణ్యేశ్వరునికి మహా రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చింతా అత్తిలింగం కుటుంబసభ్యులతో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ పురోహితుడు సద్గురువు సత్యనారాయణ పౌరోహిత్యంలో చింతా మురళి, శ్రావణి దంపతులు కర్తలుగా వ్యవహరించారు. అనంతరం శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి చంద్రకళ దంపతులు ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారం మరువలేనిది



అమిత్‌షాను కలిసిన ఎల్జీ రాధాకృష్ణన్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని లెఫ్టినెంట్ గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. ఆదివారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన అమిత్‌షాను స్వయంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

అమలాపురం టౌన్: పట్టణంలో పేకాట ఆడుతున్న బృందంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు దాడులు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు మోటారు సైకిళ్లు, రూ.2,040 నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జిల్లా ఎస్‌ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాలతో దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ అధికారులు ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో ఈ దాడుల వివరాలను తెలిపారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అమలాపురం రూరల్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఆదివారం అమలాపురం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఆర్‌వీ నాయుడు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు వెంపరాల భాస్కర్ శాస్త్రి, నారీ శక్తి రాష్ట్ర కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కోరంగి పంచాయతీ పరిధిలో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు యానాం వైపు నుంచి కాకినాడ ద్విచక్రవాహనంపై వెళుతున్న విశాఖ జిల్లా తగరపువలస గ్రామానికి చెందిన దుర్గాసి చిన్ని అనే యువకుడు ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో చిన్నికి ఎడమ కాలు విరిగింది. తీవ్ర గాయాలపాలైన యువకుడిని హైవే పోలీసులు హుటాహుటీన 108 వాహనంలో సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ధాన్యం డబ్బులు జమ చేయాలని వినతి

తాళ్లరేవు: ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పంట మొదలైన నేపథ్యంలో పెట్టుబడి పెట్టడానికి కూడా డబ్బులు లేవని తక్షణమే అధికారులు స్పందించి డబ్బులు జమ చేయాలని పి.మల్లవరం పంచాయతీకి చెందిన రైతులు మొగలితుర్తి నాగేంద్రరావు, శ్రీనివాస్, దున్నా శ్రీనివాస్, వి.దుర్గా ప్రసాద్, ఎం.సత్తిబాబు, డి.వెంకటేశ్వరరావు, పి.సత్తిబాబు తదితరులు కోరారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- మోతెక్కిస్తున్న టమాటా.. చుక్కలు చూపిస్తున్న చిక్కుడు
- పెరిగిన ధరలతో సామాన్యుల విలవిల



అమలాపురం టౌన్: పెరిగిన కూరగాయల ధరలతో సామన్యులు విలవిలలాడుతున్నారు. వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు కూరగాయల ధరలు చూసి దుకాణాలకు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. అన్ని రకాల కూరగాయలు కిలోకి రూ.10 నుంచి రూ.25 వరకూ రేటు పెరిగాయి. ప్రధానంగా టమోటా, చిక్కుడు, పచ్చిమిర్చి, క్యాప్సికం ధరలైతే ఆకాశానంటుతున్నాయి. పెరిగిన ధరలతో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 45 వేల కుటుంబాలపై ప్రత్యక్ష ప్రభావం పడింది.

రెండు వారాల్లోనే ఎంత మార్పు

నిత్యం వంటల్లో ఉపయోగించే ఉల్లి, టమాటా ధరలపై వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ రూ.25 నుంచి రూ.30 వరకూ ఉన్న కిలో ఉల్లి ప్రస్తుతం అమాంతంగా రూ.40 నుంచి రూ.45కు చేరుకుంది. టమోటా కిలో ధర మొన్నటి దాకా రూ.40 ఉంటే ప్రస్తుతం రెట్టింపు పెరిగిపోయి రూ.80 దాటేసింది. కొన్నిచోట్లయితే రూ.100 వరకూ అమ్ముతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అలాగే కిలో క్యాప్సికం కిలో మొన్నటి వరకూ రూ.60 వరకూ ఉంటే ఇప్పుడు రూ.100కి చేరుకుంది. ఇక చిక్కుడు విషయానికి వస్తే లోకల్‌గా పంట లేకపోవడంతో హైదరాబాద్ నుంచి కూరగాయల దుకాణదారులు దిగుమతి చేసుకుంటున్నారు. 20 రోజుల కిందట వరకూ కిలో చిక్కుడు రూ.60 ఉంటే ఇప్పుడు రెట్టింపు ధరతో రూ.120కు చేరుకుని సామాన్యులకు చిక్కనంటోంది. ఉల్లిపాయలు గతంలో లోకల్ పంటగా కర్నూలు రాష్ట్రం నుంచి దిగుమతి అయ్యేవి. ఇప్పుడు మహారాష్ట్ర రాష్ట్రం నుంచి దిగుమతి అవుతుండడంతో కిలో ధర రూ.10 నుంచి రూ.15 వరకూ పెరిగింది. పచ్చిమిర్చిది కూడా అదే బాట. గతంలో కిలో పచ్చిమిర్చి ధర రూ.30 నుంచి రూ.40 ఉంటే అదీ కూడా దాదాపు రెట్టింపు అంటే రూ.60కి పెరిగింది. ఇక బంగాళా దుంపలు, దొండకాయలు, ములక్కాడలు, ఆనపకాయలు తదితర కూరగాయల రకాలపై రూ.5 నుంచి రూ.10 వరకూ ధరల పెరుగుదల కనిపిస్తోంది. ప్రధానంగా గత రెండు వారాలుగా ధరలు అమాంతం పెరిగిపోయాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు.

ఎండల తీవ్రతతోనే పెరుగుదల

ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత వల్ల గోదావరి జిల్లాల్లోని నదీ పరివాహక లంక భూముల్లో పండించే కూరగాయల తోటలన్నీ కొంత మేర దెబ్బతిన్నాయి. దీనికి తోడు ఉల్లి, చిక్కుడు వంటి కూరగాయల పరంగానూ ఇతర రాష్ట్రాలపై ఆధారపడడం, అక్కడ ధరల పెంపు ప్రభావం సామాన్యులపై పడింది. గతంలో సామాన్యులు దుకాణానికి సంచి పట్టుకుని వెళితే రూ.100 నుంచి రూ.150తో వారం లేదా పది రోజులకు సరిపడే కూరగాయలు కొనుగోలు చేసుకునేవారు. ఇప్పుడు పెరిగిన ధరలతో రూ.200 నుంచి రూ.300 వెచ్చిస్తేనే గాని సంచి నిండడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. లోకల్‌గా పండించే కూరగాయల పంటలు మార్కెట్లోకి వచ్చే వరకూ ఈ పరిస్థితి తప్పదని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో కూరగాయలు దుకాణాలు అధికంగా ఉన్నాయి. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో దాదాపు 160 కూరగాయాల దుకాణాలున్నాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. రెండు నియోజకవర్గాల్లో కలిపి రోజుకు రూ.15 లక్షల మేర కూరగాయల వ్యాపారం జరుగుతుందని అంచనా. ధరల పెరుగుదలతో ప్రస్తుతం అది రూ.25 లక్షల వరకూ పెరిగిందంటున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నీలపల్లిలో జరిగిన అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఎస్‌ఐ చిట్టిబాబు

తాళ్లరేవు: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాళ్లరేవు ఎస్‌ఐ టి.చిట్టిబాబు కోరారు. ఆదివారం నీలపల్లి పంచాయతీ కార్యాలయంలో మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డ్రగ్స్ అంటే మరణంతో సమానమని, గంజాయి, హాషిష్, కొకై న్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ వినియోగించినా, కలిగియున్నా, సంబంధిత నేరాలను ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా స్థానిక నాయకులు చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చిట్టూరి కలికిమూర్తి, దంగేటి సూరిబాబు, వస్కా రెడ్డి, పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ఉప్పంగల గ్రామ పంచాయతీలో తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

తాళ్లరేవు: ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ టి.ప్రభాకరరావు కోరారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతిసార వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో మండలంలో తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉప్పంగల పంచాయతీలో ఉన్న తాగునీటి ప్రాజెక్టు ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రభాకరరావు పంచాయతీలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో ఎవరికైనా వాంతులు, విరోచనాలు, జ్వరం ఉంటే స్థానిక ఆశా వర్కర్, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడైనా తాగునీరు కలుషితంగా ఉన్నా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాఖా శంకరుడు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టి.మారుతీరావు, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే సాగు నీరు సాగేదెలా!



ఉప్పలగుప్తంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పంట కాలువను కప్పేసిన గుర్రపు డెక్క

ఉప్పలగుప్తం: ముందస్తు ఖరీఫ్ కోసం ప్రభుత్వం జూన్ 1వ తేదీనే కాలువలకు నీటిని విడుదల చేసింది. రైతులంతా నారుమడులు వేసుకోవడానికి దమ్ములు చేసుకుంటున్నారు. అయితే పంట కాలువలు గుర్రపు డెక్క, పూడికలతో మూసుకుపోవడంతో శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరు అందటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా అయినాపురం సెక్షన్ నుంచి పేరాయిచెరువు వరకూ ఉన్న పంట కాలువను గుర్రపుడెక్క కప్పేసింది. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పంట కాలువలకు ఈ దుస్థితి వచ్చి పడిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని కనీసం ఉపాధి కూలీలతోనైనా పూడికలు తొలగించి సాగు నీరు అందించాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీ నోటీసులపై ఆందోళన చెందొద్దు



చాంబర్ అధ్యక్షుడు తాతాజీకి వినతి పత్రం అందిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేస్తున్నవారికి మున్సిపాలిటీ నోటీసులు జారీ చేయడంపై ఆందోళన చెందొద్దని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక కల్వకొలను వీధిలో వ్యాపార సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ నోటీసుల విషయమై సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌ను కలిసి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపార సంఘాలకు కమిషనర్ ఇచ్చిన సమాధానం బట్టి చాంబర్ స్పందన, కార్యాచరణ ఉంటుందని వ్యాపారులకు స్పష్టం చేశారు. సమావేశంలో చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, చాంబర్ ప్రతినిధులు సంగినీడి బాబులు, అనిల్‌కుమార్ జైన్, రమణాతి రవి, దండుమేను రూపేష్ తదితరులు చాంబర్ అధ్యక్షుడు తాతాజీకి మున్సిపాలిటీ నోటీసులపై వినతి పత్రం అందజేశారు.

చెరువును తలపిస్తున్న రహదారి



జి.అగ్రహారంలో చెరువును తలపిస్తున్న రహదారి

అంబాజీపేట: కొద్దిపాటి చినుకులకే గంగలకుర్రు అగ్రహారం శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారి చెరువును తలపిస్తుంది. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిల్వ ఉండిపోతుంది దీంతో దుర్వాసనతో పాటు దోమలకు కేంద్రంగా నిలిచింది.

ఈ ప్రధాని రహదారిలో నీరు నిలవుండిపోవడంతో విద్యార్థులు, రైతులు, వృద్ధులు, శివాలయానికి వెళ్లే భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి మోక్షం కలిగించి సీసీ రోడ్డు నిర్మించాలని భక్తులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సేవలు అభినందనీయం



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న శివ కుమార్ తదితరులు

మలికిపురం: గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి వారి సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్ అన్నారు. రాజోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన చికిత్స నిమిత్తం సంస్థ సమకూర్చిన రూ.20 వేల నగదు గ్రామ పెద్దలందరూ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాటి శివ కుమార్ పాల్గొని మాట్లాడుతూ సంస్థ సేవలను కొనియాడారు. గ్రామ పెద్దలు కాండ్రేగుల శ్రీహరి, కాండ్రేగుల సత్యనారాయణ, కాండ్రేగుల నారాయణరావు, గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిలక్ మాస్టారి సేవలు ఎనలేనివి



తిలక్‌బాబు, మెహర్ సుజాత దంపతులను సత్కరిస్తున్న విద్యావేత్తలు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా తెలగాని వీవీ సత్యనారాయణస్వామి తిలక్ బాబు(తిలక్ మాస్టారు) ఎనలేని సేవలందిచారని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు తిలక్ మాస్టారు ఉద్యోగ విరమణ సత్కార సభ మాధవానంద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులునాయుడు, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గోపీనాథ్ తదితరులు మాట్లాడుతూ కృషి, పట్టుదల, సేవ తిలక్ మాస్టారికి ఎనలేని గుర్తింపు తెచ్చిపెట్టాయన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా అనేక పదవులు చేపట్టి ఉపాధ్యాయ లోకానికి ఎంతగానో సేవలందించారన్నారు. సుదీర్ఘ కాలం పాటు మండల లిటరసీ అధికారిగా సేవలందించారన్నారు. అనంతరం తిలక్‌బాబు, మెహర్ సుజాత దంపతులను దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, నాగిరెడ్డి సతీష్‌రావు, పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు

- వాసవీ క్లబ్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్
- వాడపాలెంలో గాంధీ విగ్రహావిష్కరణ



వాడపాలెంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్

కొత్తపేట: వాసవీ క్లబ్ ద్వారా పేదలు, అంధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు కొత్తపేట క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ మండపంలో డాన్ టు డస్క్ (ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలు) నిర్వహించారు. సభకు స్థానిక వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్‌యూకే లింగేశ్వరరావు అధ్యక్షత వహించగా వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్, క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ సురేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. స్థానిక వాసవీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. సేవాదృక్పదం గల ఆర్యవైశ్యులు మరింత మంది క్లబ్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం 5 గురు అంధులకు బ్లైండ్ స్టిక్స్, 20 మంది విద్యార్థులకు స్టేషనరీ కిట్స్, ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కు మాస్కులు, టవల్స్, గొడుగులు, వాసవీమాత ఆలయానికి స్టూల్స్ పంపిణీ చేశారు. పలువురిచే నేత్ర, అవయవదాన పత్రాలు పూర్తి చేయించారు. కొత్తగా 10 మందిని క్లబ్ సభ్యులుగా చేరగా వారిచే క్లబ్ నియమ నిబంధనలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండల పరిధిలోని వాడపాలెం ఆర్యవైశ్య సంఘ భవనంలో నెలకొల్పేందుకు ఆలిండియా ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రెసిడెంట్ కాళ్లకూరి నాగబాబు సమర్పించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ డిస్ట్రిక్ట్ సభ్యులు రాజా నాగరత్నకుమార్, డాక్టర్ పచ్చిపులుసు కృష్ణారావు, కొత్తపేట క్లబ్ సెక్రటరీ కొత్త ఎస్ఎస్ బంగారురామారావు (కోర్టు బంగారం), కొత్త జగన్నాథరావు, వాడపాలెం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ శ్రీఘాకోళ్లపు బీమేశ్వరరావు, సెక్రటరీ పచ్చిపులు తాతారావు, ట్రెజరర్ శ్రీఘాకోళ్లపు వీరబాబు, జిల్లా సంఘం సీనియర్ సభ్యుడు సత్యవరపు జమీందార్, సభ్యుడు శ్రీఘాకోళ్లపు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.254 కోట్లు మంజూరు చేయండి

యానాం: పుదుచ్చేరికి అదనంగా ఇవ్వాల్సిన రూ.254 కోట్లను మంజూరు చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు సీఎం రంగసామి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆర్థిక సలహా మండలి సమావేశంలో పాల్గొన్న పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ సీఎం రాసిన లేఖను నిర్మలా సీతారామన్‌కు అందించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్రం కేటాయించిన 4.85 శాతం నిధులను ఇవ్వాలని కోరారు. ఆరోగ్య, విద్య, పబ్లిక్ వర్క్స్, పోలీస్, అగ్రికల్చర్, రెవెన్యూ తదితర కీలక శాఖల్లో మొత్తం 9,600 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అదేవిధంగా 2,748 గ్రూప్-ఏ, బీ, సీ కేటగిరీ పోస్టుల ఖాళీలను దశల వారీగా భర్తీ చేస్తున్నామన్నారు. పుదుచ్చేరి తన సొంత నిధులతో ఈ పోస్టులను భర్తీ చేయడం కష్టతరంగా ఉందన్నారు. అదేవిధంగా ఎయిర్‌పోర్టు విస్తరణ, కొత్త అసెంబ్లీ భవన నిర్మాణం, సముద్రపు నీటిని మంచినీరుగా మార్చే ప్రాజెక్టులకు అదనంగా నిధులు కావాలని కోరారు.

ఘనంగా ఒలింపిక్ డే రన్



భీమనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామంలో ఆదివారం ఒలింపిక్ డే రన్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను, ఆటల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఒలింపిక్ డే రన్ ఉపకరిస్తుందని పలువురు వక్తలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి నాగరత్న కుమారి, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, హెచ్‌ఎం నూకల సత్యనారాయణ, పీడీలు కామన మధుసూదనరావు, పి.విఘ్నేశ్వరుడు, కరాటం ప్రసాద్, సరస్వతి, విజయభాస్కర్, నూకల సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు పలువురి విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శింగంశెట్టి పుల్లేశ్వరస్వామి, గంగాభవాని దంపతులు రూ.11,131 విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన బుర్ర రమేష్, శాంతికుమారి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారని ఆలయ ఈవో గ్రంధి మాధవి తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



తొండవరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్ కాలనీలో విద్యుత్ స్తంభం శిథిలస్థితికి చేరి విరిగిపోయి ప్రమాదభరితంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభం బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. పక్కనే ఉన్న చెట్టుపై ఆధారపడి పడిపోకుండా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు విద్యుత్ స్తంభం కూలిపోతుందో.. ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికుడు పి.రాజు అనేక సార్లు కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలస్థితికి చేరిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా చింతాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ దేవత చింతాలమ్మ జాతర శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

ముగిసిన రామ ఏకాహం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన కోదండ రామాలయం ఆలయ 36 వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీరామ ఏకాహం ఆదివారం ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఏకాహంలో గ్రామానికి చెందిన మోటుపల్లి సత్తిబాబు, అమృత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శనివారం రాత్రి ఏకాహం సందర్భంగా నిర్వహించిన పవళింపు సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భజన బృందాలు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

పి.గన్నవరం: ఊడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంలో వేంచేసిన కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.